గ్రామాల్లో వ్యవసాయ విప్లవం


కపిలేశ్వరపురంలో సీహెచ్‌సీ సభ్యులకు పవర్ టిల్లర్ల పంపిణీలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు (ఫైల్)

- నాలుగేళ్లల్లో నవోదయం
- గ్రామంలోనే రైతులకు ప్రభుత్వ సేవలు
- వేగంగా ఆర్బీకే భవన నిర్మాణాలు
- పెట్టుబడి సాయంతో పెరిగిన రైతు పరపతి
- తగ్గుతున్న దళారీల ప్రమేయం

కపిలేశ్వరపురం: రైతే రాజు, దేశానికి వెన్నెముక రైతు, రైతు అన్నదాత ఇలా.... వ్యవసాయం చేసే రైతును చరిత్ర చాలా పేర్లతో తన గుండెల్లో దాచుకుంది. కానీ తరతరాలుగా రైతు కష్టనష్టాలను ఓర్చుతున్న విషయాన్ని గత ప్రభుత్వం విస్మరించింది. ఉచిత విద్యుత్తు, వ్యవసాయ రుణమాఫీ వంటి చారిత్రక నిర్ణయాలతో వైఎస్సార్ రైతు పక్షాన నిలిచి చరిత్రకెక్కారు. మరో అడుగు ముందుకేసి ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షాన నిలుస్తున్నారు. రైతుకు గ్రామంలోనే అన్ని సదుపాయాలు కల్పించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు దేశం మొత్తాన్ని ఆకర్షిస్తున్నాయి. మండలంలో వ్యవసాయ రంగంలో మౌలిక మార్పులపై ఈ కథనం...

రైతు చేతుల్లో సొంత యంత్ర పరికరాలు

వైఎస్సార్ యంత్రం సేవ పథకం పేరుతో రైతులకు యంత్ర పరికరాలు అందజేసే లక్ష్యంతో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్స్ (సీహెచ్‌సీ) ఏర్పాటు చేశారు. రాయితీపై రైతులకు యంత్రాలను సమకూర్చడమూ, ఆ యంత్రాలను సమీప రైతులకు అద్దెకిచ్చుకునే వీలు కల్పించడమూ ఈ పథకం లక్ష్యం. దీంతో చిన్న రైతుల చేతుల్లోకి ఖరీదైన యంత్రాలు చేరాయి. కొనుగోలు చేసిన యంత్రం, దాని శక్తి సామర్థ్యాలు, ధర ఆధారంగా కొనుగోలుపై రాయితీని ప్రభుత్వం అమలు చేస్తోంది. దాని తాలూకు సొమ్మును 2021 అక్టోబర్ 26న తొలిసారిగా నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు ఖాతాలకు విడుదల చేశారు. మండలంలో 19 సీహెచ్‌సీ గ్రూపులకు యంత్రాలను అందించారు. డీసీసీబీ ద్వారా ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుండగా యంత్రం కొనుగోలు సమయంలో రైతు 10 శాతం భరిస్తాడు. మిగిలిన 50 శాతం ప్రభుత్వం బ్యాంకు రుణం ఇప్పిస్తుంది. ఆ మొత్తాన్ని ఆరు నెలలకు ఒక వాయిదా చొప్పున ఆరు వాయిదాల్లో తీర్చుకోవచ్చు.

యంత్రాలు పొందిన గ్రూపులివే...

మండలంలో 19 సీహెచ్‌సీలకు రాయితీపై యంత్ర సదుపాయం కల్పించారు. తాతపూడి వైఎస్ విజయమ్మ సీహెచ్‌సీ, కపిలేశ్వరపురంలో శ్రీవిఘ్నేశ్వర, శ్రీశివపార్వతి, అంగరలో రాజన్నా, విజయమ్మ, పడమర ఖండ్రికలో రామచంద్ర , వెదురుమూడిలో శ్రీశ్రీనివాస, వల్లూరులో వైఎస్సార్, నేలటూరులో శ్రీసీతారామ, వడ్లమూరులో శ్రీశ్రీనివాస, నల్లూరులో శ్రీదుర్గా, కాలేరులో శ్రీచైతన్య, టేకిలో శ్రీసాయిబాబా, శ్రీఅన్నపూర్ణ, మాచరలో శ్రీనివాస కోరుమిల్లిలో వైఎస్సార్‌రైతు, అద్దంకివారిలంకలో శ్రీవెంకటేశ్వర, కేదారిలంకలో శ్రీలక్ష్మీగణపతి సీహెచ్‌సీ గ్రూపులు లబ్ధి పొందాయి.


టేకి ఆర్బీకేలో సేవలందిస్తున్న సిబ్బంది

అద్భుతాలు సృష్టిస్తున్న ఆర్బీకే వ్యవస్థ..

ఒకప్పుడు రైతులు తమ సమస్యల పరిష్కారానికి మండల కేంద్రం చుట్టూ తిరిగేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామంలోనే రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. రైతు సంబంధిత అన్ని సేవలనూ ఆర్బీకే ద్వారానే అందిస్తోంది. మండలంలో 19 రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయగా వాటిలోని 15 గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. మూడు భవనాలు పూర్తయ్యాయి. వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉంటున్నారు.

మండలంలో వివిధ పథకాల్లో లబ్ధి పొందుతున్న రైతుల వివరాలు ఇలా..

గ్రామం	సాగు భూమి	రైతుల సంఖ్య	కౌలు కార్డులు	యంత్ర పథకం	రైతు భరోసా
తాతపూడి	473	310	314	06	415
కపిలేశ్వరపురం	1,406	1,023	325	11	1,053
అంగర	1,869	1,375	474	10	947
పడమర ఖండ్రిక	514	510	305	05	341
వెదురుమూడి	581	380	174	05	222
వల్లూరు	1,377	754	166	05	430
నేలటూరు	642	444	312	05	296
నిడసనమెట్ట	262	222	157	--	139
వడ్లమూరు	421	240	174	05	116
నల్లూరు	1,280	806	331	06	461
కాలేరు	990	600	327	06	336
టేకి	2,129	1,343	497	10	1,048
మాచర	1,692	1,350	415	05	937
కోరుమిల్లి	311	358	324	06	646
వాకతిప్ప	1,810	1,201	462	05	727
మొత్తం	15,757	10,916	4,757	90	8,114

రూ.70వేల రాయితీ లభించింది



నేను టేకి-02 రైతు భరోసా కేంద్రంలో శ్రీఅన్నపూర్ణ సీహెచ్‌సీ గ్రూపులో సభ్యుడిని. గ్రూపు తరఫున మూడు పవర్ టిల్లర్లను తీసుకున్నాం. వాటి ధరల్లో రూ.70 వేల రాయితీని పొందాం. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

–చెల్లుబోయిన సూర్యనారాయణ, శ్రీఅన్నపూర్ణ సీహెచ్‌సీ సభ్యుడు,టేకి

కౌలు కార్డు ప్రక్రియ సులువుగా పూర్తయ్యింది



నేను టేకి గ్రామంలో మూడు ఎకరాలు కౌలుభూమి సాగు చేస్తున్నాను. కౌలు కార్డు కోసం గతంలో రైతులంతా కపిలేశ్వరపురం చుట్టూ తిరిగేవారు. కౌలు కార్డు కోసం గ్రామ సచివాలయంలో వీఆర్వో వద్ద దరఖాస్తు చేయగా మంజూరు చేసి ఇచ్చారు.

–చిగురుపాటి రామ్మోహనరావు, టేకి

రైతు భరోసా ఆదుకుంటుంది



ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు ఎంతగానో రైతులను ఆదుకుంటున్నాయి. రైతు భరోసా పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సాయం వ్యవసాయ పెట్టుబడికి ఉపయోగపడుతోంది. ఇప్పుడు నా బ్యాంకు ఖాతాకు రైతు భరోసా పథకం ద్వారా రూ. 5,500 జమ అయ్యింది. సంతోషంగా ఉంది.

–మేడిశెట్టి శ్రీనివాస్, రైతు, టేకి

యాంత్రీకరణను పెంపొందించే లక్ష్యంగా కృషి



మారుతున్న కాలానికి అనుగుణంగా వ్యవసాయ సాగులో రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణకు అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అందులో భాగంగా సీహెచ్‌సీ గ్రూపులకు చేయూత ఇస్తూ రాయితీని అమలు చేస్తుంది. యంత్రాలు రైతు చేతిలో సిద్ధంగా ఉండటం ద్వారా సాగు ప్రక్రియలో సులభ పద్ధతులను అవలంభించే వీలు కలుగుతుంది.

–కేవీఎన్ రమేష్‌కుమార్, ఏఓ, కపిలేశ్వరపురం

త్వరితగతిన భవనాలు పూర్తి



ఒక్కో ఆర్బీకే భవనానికి రూ. 21.80 లక్షల చొప్పున 15 భవన నిర్మాణాలకు నిధులు మంజూరయ్యాయి. వాటిలో మాచర, వాకతిప్ప, వడ్లమూరు, నల్లూరు భవనాలు పూర్తయ్యాయి. మిగిలిన వాటి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం.

–డీవీ రాఘవులు, జేఈ, పంచాయతీరాజ్‌శాఖ, కపిలేశ్వరపురం

క్లుప్తంగా

పథకాలే పార్టీకి శ్రీరామరక్ష

కాజులూరు: రాష్ట్రంలో సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలే పార్టీకి శ్రీరామరక్ష అని, వాటిని ఉపయోగించుకోవడంలో ప్రజల్లో సరైన అవగాహన కల్పించటం ద్వారా మరోసారి వైఎస్సార్ సీపీ అధికారంలోకి తీసుకురాగలమని పార్టీ మండల బీసీ సెల్ కన్వీనర్ గుబ్బల ఏసురాజు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు అన్నారు. గొల్లపాలెం గ్రామ సచివాలయం -2లో గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు శనివారం అధికారులు సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో ఏ కారణం చేతనైనా పథకాలు అందకుండా మిగిలిపోయిన లబ్ధిదారులు ఉంటే వారిని గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలన్నదే 'జగనన్న సురక్ష' కార్యక్రమం ఉద్దేశమన్నారు. పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, పార్టీ నాయకులు తోట కృష్ణ, డీఈ జయప్రద, మాత నాగరాజు, నాగేశ్వరరావు, వెలగా శివ పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడాలి


విద్యార్థులను సత్కరిస్తున్న మంత్రి వేణు

రామచంద్రపురం: విద్యార్థులు తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తిస్తూ సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు కావాలని బాధ్యతగా వ్యవహరించాలని రాష్ట్ర బీసీ సంక్షేమం శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. పట్టణంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో శనివారం జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన భాష్యం స్కూల్ పూర్వ విద్యార్థులైన బి.హర్షిత, కె.లక్ష్మీప్రణతి, ప్రశాంత్‌లను మంత్రి వేణు చేతుల మీదుగా సత్కరించారు. భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ చక్రధర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ పార్టీ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందు, తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులపై అవగాహన పెంచుకోవాలి

కాజులూరు: నానో ఎరువులపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఇఫ్కో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల మేనేజర్ గుంటక శ్యామ్ ప్రసాద్‌బాబు అన్నారు. శనివారం జగన్నాథగిరి ఆర్బీకేలో వీఏఏ రాజేష్ అధ్వర్యంలో జరిగిన సాగుకు సమాయత్తం కార్యక్రమంలో శ్యామ్‌ప్రసాద్‌బాబు పాల్గొని ఇఫ్కో సంస్థ నూతనంగా ప్రవేశపెట్టిన నానో ఎరువుల వాడటం వల్ల కలిగే ప్రయోజనాలు, వాడే విధానాలను రైతులకు వివరించారు. ఖరీఫ్ సాగు ప్రణాళికలపై రైతులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కొప్పన లక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ కాకర్లపూడి శివకృష్ణ, సీఈఓ కేవీ నరేష్, రైతులు పాల్గొన్నారు.

పాడి రైతుల ప్రోత్సాహానికే మహిళా డెయిరీ

రాయవరం: మహిళా పాడి రైతులను ప్రోత్సహించేందుకే ప్రభుత్వం మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్ ఏర్పాటు చేస్తుందని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్ అన్నారు.సోమేశ్వరంలో శనివారం మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్ ఏర్పాటు చేశారు.సమావేశంలో 74 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో మహిళా డెయిరీ అసోసియేషన్‌కు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. చీఫ్ ప్రమోటర్‌గా మేడిశెట్టి వెంకటలక్ష్మి, ప్రమోటర్‌గా అడపా ఆశాజ్యోతి, సెక్రటరీగా పాకలపాటి లావణ్య ఎన్నికయ్యారు. ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎ.నాగశ్రావణి, పంచాయతీ కార్యదర్శి ఎ.వెంకటరమణ, రూట్ ఆఫీసర్ బి.రత్నకుమార్ పాల్గొన్నారు.

వైద్యురాలి నియామకం

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ హోమియో ఆసుపత్రికి వైద్యురాలు లేక రోగులు అవస్థలు పడుతున్న విషయం పాఠకులకు విదితమే. ఈ నేపథ్యంలో శనివారం హోమియో వైద్యురాలు డాక్టర్ విజయ ప్రతిభ విధుల్లో చేరారు. దీనితో గ్రామ ప్రజలు, పరిసర గ్రామాల నుంచి వైద్యానికి వచ్చే వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. న్యాయవాది మాగాపు అమ్మిరాజు స్థానికులతో కలసి డాక్టర్ విజయ ప్రతిభను పూలదండతో సత్కరించి ఆహ్వానం పలికారు. కొన్నాళ్లుగా వైద్యులు లేక ఇబ్బంది పడినా మళ్లీ వైద్యురాలి నియామకం కావడం సంతోషించదగ్గ విషయమని అన్నారు. ఎఫ్ఎన్ఓ వి.అమ్మాజీ, కాంపౌండర్ షేక్ అమీర్ జానీ పాల్గొన్నారు.

వేధిస్తున్నాడంటూ మహిళ ఫిర్యాదు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో యానాం సెంటర్ వద్ద తేజ సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్న సురేష్ అనే వ్యక్తి ఫోన్ చేసి వేధిస్తున్నాడంటూ వెలంపాలెంకు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ శనివారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. వెలంపాలెంకు చెందిన ఓ మహిళకు సెల్‌ఫోన్ నిర్వాహకుడు సురేష్ తరచూ ఫోన్ చేసి అసభ్యకరంగా మాట్లాడుతూ వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఆమె 22న సెల్‌ఫోన్ షాపునకు వెళ్లి సురేష్‌ని నిలదీసింది. దీంతో సురేష్ ఆమెపై దౌర్జన్యం చేయడంతో ఆమె స్పృహ తప్పి పడిపోయింది. దీంతో ఆమెను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు. ఆసుపత్రి సమాచారం, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినోద్ తెలిపారు.

చూశారు.. పరిష్కరించారు..

- తాగునీరు, డ్రైనేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- మసకపల్లిలో గడప గడపకూ..


మసకపల్లి మత్స్యకార కాలనీలో డ్రైనేజీని పరిశీలిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: గ్రామంలో ఏళ్ల తరబడి గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలు స్థానికుడి దృష్టిలో చూసి వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ. మండలంలోని మసకపల్లిలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి చెల్లుబోయిన వేణు గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ కుటుంబానికి జరిగిన మేలును వారికి వివరించి కరపత్రాన్ని అందించారు. గ్రామ పర్యటనలో తాగునీరు, డ్రైనేజీ సమస్య ప్రధానంగా ఉండడం గమనించి మంత్రి వెంటనే ఆయా శాఖల అధికారులను ఫోన్‌లో సంప్రదించారు. గ్రామ ప్రజలకు ఈ సమస్యల నుంచి బయటపడేయాలనే ఉద్దేశంతో మరింతగా ఆలోచించి సమస్యకు పరిష్కారం చూపారు. గ్రామంలో ఉన్న ప్రభుత్వ కుళాయిల నుంచి స్వచ్ఛమైన తాగునీరు పూర్తి స్థాయిలో రావడం లేదు. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను సంప్రదించి వెంటనే వాటర్ ఫిల్టర్ బెడ్‌ల ఏర్పాటుకు రూ.15 లక్షలు మంజూరు చేయించి వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో పాటు గ్రామం డ్రైనేజీ వ్యవస్థ ఉన్నప్పటికీ అక్కడక్కడ పూరిస్థాయిలో డ్రైనేజీలు పాడైపోవడం, లేకపోవడం గమనించారు. గ్రామంలో రెండు రోజుల పాటు పంచాయతీ సిబ్బంది డ్రైనేజీలన్నీ క్లీన్ చేయించాలని ఎక్కడ పాడైపోయి ఉన్న డ్రైనేజీలో కొత్తగా వేయాల్సిన డ్రైనేజీల నిర్మాణానికి ప్రతిపాదలను పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఏళ్ల తరబడి ఉన్న సమస్యలను కళ్లారా చూసి పరిష్కరించడంతో గ్రామస్తులతో పాటు పంచాయితీ పాలకవర్గ సభ్యులు మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణను అభినందించారు. ఎంపీపీ పంపన నాగమణి, మార్కెట్ కమిటి చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, సర్పంచ్ పిల్లి అన్నపూర్ణ, మండల కోఆప్షన్ సభ్యులు కడలి విజయదుర్గ, కన్వీనర్లు పిల్లి కల్యాణ్, కాదా గోవిందు, లంకే శ్రీను, చోడ శివకేశరరావు, వాతాడి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన పారిశుధ్యం

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- 29వ వార్డులో పర్యటన


స్థానికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన పారిశుధ్య నిర్వహణ సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అన్నారు. వార్డు పర్యటనలో భాగంగా శనివారం 29వ వార్డు కౌన్సిలర్ పిల్లి శ్రీనివాస్, మున్సిపల్ అధికారులతో కలిసి ఆ వార్డులో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ, డ్రైన్ల శుభ్రం గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వారు తెలిపిన సమస్యలపై అక్కడికక్కడే శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్య, శానిటేషన్ సెక్రటరీలతో మాట్లాడి పరిష్కరించే ప్రయత్నం చేశారు. వర్షాకాలం మొదలైన నేపథ్యంలో వార్డుల్లో ఎక్కడా అపరిశుభ్రత తలెత్తకుండా ప్రజలు సహకరించాలని కోరారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందజేయాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని చైర్‌పర్సన్ దుర్గారాణి కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, షేక్, జంగమ కార్పొరేషన్ల డైరెక్టర్లు షేక్ ఆలీఖాన్‌బాబా, మీగడ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ అర్బన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, కౌన్సిలర్లు శెట్టి కళ్యాణి, అమలదాసు లక్ష్మి, ఏఎంసీ డైరెక్టర్ షేక్ మస్తాన్, వీరాంజనేయస్వామి ఆలయ కమిటీ చైర్మన్ సూరంపూడి సత్యప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడి రామారావు, సత్తిబాబు, మొండి మురళి, కొడమంచిలి భాస్కరరావు, రెడ్డి రత్తయ్య, మీసాల రమణ పాల్గొన్నారు.

పాపారాయుడుకు ఎంపీ బోస్ పరామర్శ


పాపారాయుడును పరామర్శిస్తున్న ఎంపీ బోస్

మండపేట: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదం నుంచి కోలుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న వైఎస్సార్ సీపీ రంపచోడవరం నియోజకవర్గ పరిశీలకుడు కర్రి పాపారాయుడును శనివారం రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్‌చంద్రబోస్ పరామర్శించారు. అర్తమూరులోని పాపారాయుడు నివాసానికి చేరుకుని ఆయన యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తి ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని ఎంపీ బోస్ ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ నాయకులు ఉన్నారు.

శ్రీనివాసరావును పరామర్శించిన పృథ్వీరాజ్

రాయవరం: పితృ వియోగంతో బాధపడుతున్న మండపేట ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావును వైఎస్సార్‌సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ శనివారం పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి చంద్రరావు ఈ నెల 18న మృతి చెందారు.ఈ క్రమంలో శ్రీనివాసరావును పృథ్వీరాజ్ పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేసి, చంద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఉద్యాన యూనివర్సిటీ డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచులు వాసంశెట్టి వెంకట్రావు, వీధి వెంకటరెడ్డి, మండపేట మున్సిపల్ వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం

రాయవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని వైఎస్సార్‌సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. మండలంలోని కురకాళ్లపల్లిలో శనివారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ మాట్లాడుతూ ప్రజల ముంగిటకు అన్ని రకాల సేవలు అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అనంతరం సర్పంచ్ పిల్లి శారద ఆధ్వర్యంలో గడపగడపకూ నిధులు రూ.20 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.3 లక్షలు, జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టే బీసీ సామాజిక భవన నిర్మాణం, పలు అభివృద్ధి పనులకు పృథ్వీరాజ్, మంగతాయారు, వెంకటరమణ భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పితాని ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు వాసంశెట్టి వెంకటలక్ష్మి, గ్రామ సచివాలయ కన్వీనర్ ఎంవీవీ సత్యనారాయణ, మాజీ ఎంపీపీ రాయుడు సత్యనారాయణ (పూస), వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

పలువురుకి పృథ్వీరాజ్ పరామర్శ

కపిలేశ్వరపురం: ఆప్తులను కోల్పోయి బాధల్లో ఉన్న వారిని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట పృథ్వీరాజ్ శనివారం పరామర్శించారు. కపిలేశ్వరపురం, కోరుమిల్లి, కాలేరు గ్రామాల్లోని వారిని ఓదార్చారు. ఆయన వెంట పార్టీ నాయకులు పలివెల మధు, శీలం భాస్కరరావు, ఏలేటి గంగరాజు, పిప్పర సంపతరావు, బొక్కా రాంబాబు తదితరులున్నారు.

చదువే భవిష్యత్తును నిర్దేశించేది

కపిలేశ్వరపురం: భవిష్యత్తును నిర్దేశించేది చదువే అని మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం హెచ్ఎం రమాదేవి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. పదో తరగతి పరీక్షల్లో 555, 530, 519 మార్కులు సాధించిన ఈ స్కూల్ విద్యార్థినులు పీవీ రాజ్యలక్ష్మి, బి.సుమశ్రీ , కె.స్వాతిలకు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. మాచర, కోరుమిల్లి గ్రామాల సర్పంచ్‌లు వాసంశెట్టి సునీత, ఆచంట సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యార్థుల కృషిని అభినందించారు. ఉపాధ్యాయులు వాడ్రేవు శ్రీనివాసరావు, నూకపెయ్యి వెంకట్, షిరిడి సాయి, శ్రీనివాసరావు, వీరబాబు విద్యార్థినుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ

రామచంద్రపురం: కొత్తగా ఎంపికైన పారా లీగల్ వలంటీర్లకు రెండు రోజుల పాటు జరిగే శిక్షణ కార్యక్రమాన్ని శనివారం సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీస్ చైర్మన్ కె.మాధవిదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. పారా లీగల్ వలంటీర్లకు పలు చట్టాలపై అవగాహన, వారి విధుల నిర్వహణ బాధ్యతలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి వి.నాగేశ్వరరావునాయక్ న్యాయవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, కాకులవరపు రామచంద్రరావు, టీడీఎస్ జానకీ కేవీ సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

చెల్లూరులో పూర్వ విద్యార్థుల భేటీ


45 ఏళ్ల అనంతరం కలిసిన చెల్లూరు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

రాయవరం: చెల్లూరు గ్రామంలోని సర్వారాయ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనాన్ని శనివారం ఆ పాఠశాలలో నిర్వహించారు. 1973-78 మధ్య 6 నుంచి టెన్త్ వరకూ చదివిన విద్యార్థుల కలయిక ఆహ్లాదకరంగా సాగింది. సుమారు 45 ఏళ్ల అనంతరం విద్యార్థులంతా కలుసుకున్నారు. 52 మంది పూర్వ విద్యార్థులకు గాను వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన 45 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరూ నాటి గురువులు ప్రభాకరరాజు, చలమయ్యలను సత్కరించుకున్నారు, అనంతరం గురువులతో కలసి పూర్వ విద్యార్థులు గ్రూపు ఫొటో దిగారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రామచంద్రపురం రూరల్: పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ శనివారం విలేకరులకు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని తాళ్లపొలం శివారు నవరత్నాలగరువుకు చెందిన వాసంశెట్టి కృష్ణమూర్తి (42) పొలం కౌలు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఇటీవల పంట నష్టం వచ్చి అప్పులు ఉండటంతో అవి తీర్చలేక మానసిక వేదనతో ఈ నెల 18న పురుగు మందు తాగాడు. కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

రామచంద్రపురం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో కపిలేశ్వరపురం, రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టులకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులకు ఆర్డీవో పి.సింధూ సుబ్రహ్మణ్యం శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆయా ప్రాజెక్టుల్లో మొత్తం 9 పోస్టులకు గాను 11 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇన్‌చార్జ్ డివిజనల్ మెడికల్ ఆఫీసర్ కృష్ణహరీష్, సీడీపీవో గజలక్ష్మి పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండర్‌ను అనుసరించాలి

రాయవరం: ప్రధానోపాధ్యాయుల టేబుల్స్‌పై అకడమిక్ క్యాలెండర్ ఉండాలని, దానిని విధిగా ప్రతి హెచ్ఎం అనుసరించాలని రాయవరం ఎంఈఓలు వివేకానంద, సూర్యనారాయణ సూచించారు. మండల విద్యా శాఖ కార్యాలయంలో శనివారం హెచ్ఎంల సమావేశం నిర్వహించారు. ఎంఈవోలు వివేకానంద, సూర్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో నూరు శాతం ఎన్‌రోల్‌మెంట్ జరగాలన్నారు. బడి ఈడు విద్యార్థులందరూ పాఠశాలల్లోనే చదవాలన్నారు. ప్రతి విద్యార్థికీ జగనన్న విద్యా కానుక కిట్లను అందజేయాలన్నారు. జిల్లా స్థాయి అధికారులు, ఎంఈవోలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు తరచూ పర్యవేక్షణ చేస్తారన్నారు. సమావేశంలో ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ ఎస్. రామారావు, సీఆర్పీలు కిలపర్తి పోసిరాములు, వైఎల్ వీర్రాజు, వాసంశెట్టి సీతా ధనలక్ష్మి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు వి.శాంతిసునీత, నూలు ఆదినారాయణ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.